

తెలంగాణ సచివాలయంలో బోనాలు సందర్భంగా నిర్వహించిన ఊరేగింపు దృశ్యం

హైదరాబాద్ వార్త

# హైడ్రా...తిరేకాలు... ఆరోపణలు

- ప్రభుత్వ స్థలాల పరిరక్షణే ధ్యేయంగా హైడ్రా ఏర్పాటు
- చెరువులు, పార్కులు, రోడ్లు, నాలాల కబ్జాలపై దృష్టి
- పేదలను కొట్టి..పెద్దలను కాపాడుతుందన్న విమర్శలు
- అధికార, ప్రతిపక్ష పార్టీల నుంచి సైతం తప్పని ఒత్తిళ్లు
- సంవత్సర కాలంలో 480 ఎకరాలు
- 50కిపైగా పార్కులు, నాలాలు కబ్జాల నుంచి విముక్తి
- రేపటితో ఏడాది పూర్తి చేసుకోనున్న హైడ్రా



**హైదరాబాద్,జూలై 17,ప్రభాతవార్త:** హైదరాబాద్ లో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం తీసుకొచ్చిన హైడ్రా ఏడాది పూర్తి చేసుకుంది. గతేడాది జూలై 19న ప్రారంభమైన హైడ్రా రాష్ట్రవ్యాప్తంగా వార్తల్లో నిలిచింది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాలు, రోడ్లు, నాలాల కబ్జాలను కాపాడేందుకు రేవంత్ సర్కార్ హైడ్రా ను ఏర్పాటు చేసింది.. దానికి సీనియర్ ఐపీఎస్ అధికారి ఏవీ రంగనాథ్‌ను కమీషనర్‌గా నియమించి విశిష్ట అధికారాలను కట్టబెట్టింది. ఆతర్వాత హైడ్రా చర్యలతో జేసీబీలు కనబడితే చాలు ఆక్రమణదారులు వణికి పోయిన పరిస్థితి కనిపించింది. ముఖ్యంగా ప్రభుత్వ ఆస్తులను కాపాడటం, నగరంలోని గొలుసుకట్టు చెరువులను పునరుద్దరించడం, ప్రకృతిని కాపాడటం కోసం ఏర్పడిందని సీఎం రేవంత్ రెడ్డి పదే పదే స్పష్టం చేసినప్పటికీ హైడ్రా పై ప్రజల్లో అనేక అపోహలు నెలకొన్నాయి.. పేదవారిదైతే ఒకతీరు, ధనవంతులదైతే మరో తీరులా హైడ్రా ప్రవర్తిస్తుందని భిన్నాభిప్రాయం నెలకొంది. తొలినాళ్లలో అడపా దడపా కూల్చివేతలు చేపట్టి వార్తల్లో నిలిచినా.. ఆతర్వాత సినీ నటుడు నాగార్జున ఎన్ కన్వెన్షన్ కూల్చివేతలో హైడ్రా పేరు మారుమ్రోగింది.. గత బిఆర్ఎస్ ప్రభుత్వంతో నాగార్జునకు సత్సంబంధాలుండటం వల్లే ఎన్ కన్వెన్షన్‌ను హైడ్రా కూల్చివేసిందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. సినీ ఇండస్ట్రీని గుప్పిట్లో పెట్టుకోవడం కోసం రేవంత్ సర్కార్ ఎన్ కన్వెన్షన్‌తో భయపెట్టాలని చూసిందని పలు రాజకీయ పార్టీలు ఆరోపించాయి. దీనిపై నటుడు నాగార్జున హైకోర్టుకు మెట్లు సైతం ఎక్కారు. కోర్టు నుంచి స్టే ఆర్డర్ తెచ్చుకునే లోపే ఎన్ కన్వెన్షన్ కూల్చివేశారు. తర్వాత నాగార్జునే తన దగ్గరికి వచ్చి ఆ రెండెకరాలను ప్రభుత్వానికి అప్పగించి మంచి కాజ్‌లో నేనూ ఒక భాగస్వామిని అవుతానని నిజమైన హీరో అనిపించుకున్నాడని సీఎం రేవంత్ ఇచ్చిన స్టేట్మెంట్‌తో ఆసమస్య అక్కడితో ముగిసింది. హైడ్రా ఏర్పాటైన తర్వాత ముఖ్యంగా చెరువుల ఎఫ్టీఎల్, బఫర్ జోన్లపై ఫోకస్ చేసింది. ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో ఏర్పడ్డ నిర్మాణాలను కూల్చడంతో ఉద్రిక్తలకు కారణం అయింది. పేదల గుడిసెలు, ఇండ్లు మాత్రమే కూలుస్తున్నారని, పెద్దల జోలికి మాత్రం పోవట్లేదనే ఆరోపణలు సైతం వచ్చాయి. ఇందులో భాగంగా పలు విద్యాసంస్థలకు హైడ్రా నోటీసులు జారీ చేసింది. బీఆర్ఎస్‌కి చెందిన ఎమ్మెల్యే మల్లారెడ్డి, పల్లారాజేశ్వర్ రెడ్డిలతో పాటు ఓవైసీ బ్రదర్స్ కు చెందిన ఫాతిమా కాలేజీలు చెరువులను ఆక్రమించి నిర్మించారని హైడ్రా నోటీసులు జారీచేసింది. అయితే వాటిని వెంటనే కూల్చేయకుండా విద్యా సంవత్సరం పూర్తైన తర్వాత కూలుస్తామని కమీషనర్ రంగనాథ్ ప్రకటించినప్పటికీ.. ఆతదనంతరం వాటి జోలికి పోకపోవడంతో హైడ్రాపై రాజకీయ ప్రమేయం పెరిగిందన్న అపవాదును మూటకట్టుకుంది. అలాగే ఇటీవల ఎక్స్ వేదికగా ప్రజలు అడిగిన ప్రశ్నల్లో ఫాతిమా కాలేజ్ ఓవైసీకి చెందింది కాబట్టే దాని జోలికి హైడ్రా వెళ్లట్లేదా అని హైడ్రా కమీషనర్ రంగనాథ్ ను ఓసిటిజన్ సూటిగా ప్రశ్నించారు. అయితే ఓవైసీ ఫాతిమా కాలేజ్ ఒక చారిటీ కోసం ఏర్పడిన ఇన్స్టిట్యూట్ అని వేల మంది ఆడపిల్లలు ఉచితంగా విద్యనభ్యసిస్తున్నారని అందుకే కూల్చలేదని కమిషనర్ సమర్థించుకున్నారు. హైడ్రా చర్యలతో నగరంలోజరుగుతున్న అనేక కబ్జాలపై ప్రజలు ఫిర్యాదులు చేయడానికి హైడ్రా ఆఫీస్‌కు క్యూ కట్టారు.దీంతో ప్రతీ సోమవారం ప్రజావాణిఏర్పాటు చేశారు కమిషనర్ రంగనాథ్. నేరుగా ఫిర్యాదులు స్వీకరించి వాటిని క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే యాక్షన్ తీసుకోవాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. అలాగే కబ్జాదారులపై కేసులు పెట్టేందుకు ప్రత్యేకంగా హైడ్రా పోలీస్ స్టేషన్ సైతం ప్రారంభించారు. కానీ పోలీస్ స్టేషన్ ఏర్పాటై మూడు నెలలైనా ఒక్క ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేకపోయింది హైడ్రా. దీనికి కారణం హైడ్రాకు ప్రత్యేక కోర్టు కేటాయింపులో జాప్యం జరుగుతుండటమే.. అలాగే అక్రమ కట్టడాలకు అనుమతులిచ్చిన గత అధికారులపై మొదటల్లో ఆరుగురిపై కేసు నమోదు చేసినప్పటికీ ఆతర్వాత ప్రభుత్వ అధికారులపై కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతానికి ఓఆర్ఆర్ లోపలికే పరిమితమైన హైడ్రా భవిష్యత్‌లో ట్రిపుల్ఆర్ వరకు విస్తరించే అవకాశముందనే చర్చ జరుగుతోంది. అటు హైడ్రా పేరు చెప్పి పలువురు దందాలు చేసేవాళ్లు ఉన్నారు.. దీంతో ప్రభుత్వానికి మైలేజ్ కంటే మైనస్సే ఎక్కువగా అయినట్లు అధికార పార్టీలోనూ జోరుగా చర్చ జరిగింది. ఎన్నో ఏళ్లుగా తీరని సమస్యలను హైడ్రా తీరుస్తుందని పాలాభిషేకాలు చేసిన ప్రజలు ఉన్నారు. అలాగే చెప్పాపెట్టకుండా ఎలాంటి నోటీసులివ్వకుండా హైడ్రా తమ నిర్మాణాలను కూలుస్తుందని దుమ్మెత్తిపోసిన వాళ్లున్నారు. కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్న ఎమ్మెల్యేలు దానం నాగేందర్, అరికపూడి గాంధీ లాంటి వాళ్లే బహిరంగంగా హైడ్రా చర్యలను విమర్శించారు. ఇది ప్రభుత్వానికి ఎప్పటికైనా తలనొప్పేనంటూ హాట్ కామెంట్స్ చేశారు. హైడ్రా బాద్‌లో కార్పోరేషన్ ఎన్నికలు వస్తే తాము ఏ మొహం పెట్టుకుని వెళ్లి ప్రజ లను ఓట్లడగాలని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం కూల్చివేతల టైమ్ లో స్థానిక ఎమ్మెల్యేకు కూడా సమాచారం ఇవ్వకుండా కూల్చేస్తున్నారని మండిపడ్డారు. అలాగే హైడ్రా రాకతో రియల్ ఎస్టేట్ పడిపోయిందని ప్రధానంగా చర్చలోకి వచ్చింది. రేవంత్ సర్కార్ తెచ్చిన హైడ్రా వల్ల రియల్టర్లు మార్కెట్ లేక హైడ్రాను విమర్శించిన వారు అనేక మంది ఉన్నారు. అల్వాల్ బిల్డర్ వేణుగోపాల్ రెడ్డి సూసైడ్ ఘటన ఈ ఆరోపణలకు ఆజ్యం పోసింది. రియల్ ఎస్టేట్ లో కొనుగోళ్లు అమ్మకాలు లేక రియల్టర్లు కుదేలైనట్టు అనేక వార్తలొచ్చాయి. దీనంతటికీ కారణం హైడ్రా చర్యలేనని అటు రాజకీయ పార్టీలు సైతం ఈ అంశాన్ని వాడుకున్నాయి. ఫలితంగా కాంగ్రెస్ పార్టీకి హైడ్రా ఒక తలనొప్పిగా మారిందని పార్టీ అంతర్గత సమావేశాల్లోను చర్చకు దారి తీసింది. అయితే చెరువులను ధ్వంసం చేస్తూ వెలిసిన కట్టడాలను చూసి అదే అభివృద్ధి అనుకుంటే పొరపాటే అని రియల్ ఎస్టేట్ ఇప్పుడే సరైన మార్గంలో వెళ్తుందని, చెరువులను వదిలి ఇతర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ అభివృద్ధి చెందుతుందని తెలుపుతున్నారు.

### 30వేలకోట్ల విలువైన ప్రభుత్వభూమి కాపాడాం : హైడ్రా కమిషనర్ రంగనాథ్



ఈ సంవత్సర కాలంలో దాదాపు 480 ఎకరాల ప్రభుత్వ భూములు కాపాడగా వందకు పైగా అక్రమ కట్టడాలను కూల్చివేసినట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రకటించారు. కబ్జా కోరల్లో ఉన్న దాదాపు 50 పార్కులను రికవరీ చేశామని ప్రకటించారు. వీటి విలువ దాదాపు 30వేల కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నామన్నారు. చెరువుల్లో నిర్మించిన అక్రమ కట్టడాలను కూల్చడమే కాకుండా పాడైన చెరువులకు పునరుజ్జీవం పోస్తున్నామని తెలిపారు. మాదాపూర్ లోని తుమ్మిడికుంట, సున్నం చెరువు, అంబర్ పేట్ బతుకమ్మ కుంట, కూకట్‌పల్లి నల్లచెరువు, ఉప్పల్ నల్ల చెరువు, ఓల్డ్ సిటీ బమ్రుక్‌దౌలా చెరువులను పునరుద్దరిస్తున్నట్లు తెలిపారు. ఈఏడాది ఈకుంటలు, చెరువులను నీటితో కలకలలాడేలా తీర్చిదిద్దడమే తమలక్ష్యం అన్నారు.

## జిహెచ్ఎంసికి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు

### దేశవ్యాప్తంగా ఆరోస్థానం



అవార్డుతో మున్సిపల్‌శాఖ కార్యదర్శి ఇలంబర్తి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, ఏసి రఘు ప్రసాద్ తదితరులు

**హైదరాబాద్,జూలై 19,ప్రభాతవార్త:**
స్వచ్ఛ షహర్‌గా' గ్రేటర్ హైదరాబాద్" ఎంపికైన నేపథ్యంలో గురువారం న్యూఢిల్లీ లోనీ విజ్ఞాన్ భవన్ లో గృహనిర్మాణ , పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్వహించే జాతీయ కార్యక్రమంలో కేంద్ర మంత్రి మనోహర్ లాల్ చేతుల మీదుగా స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డును పురపాలక పట్టణాభివృద్ధి కార్యదర్శి డా కె ఇలాంబర్తి కమిషనర్ ఆర్ వి కర్ణన్ లు స్వీకరించారు.స్వచ్ఛ సర్వేక్షణ్ 2024 సర్వేలో10లక్షలు ఆపైన జనాభా కలిగిన"వ్యర్థాల రహిత నగరం" కేటగిరీలో ఉత్తమ ప్రతిభ కనబరిచి 6వ ర్యాంక్‌తో 7 స్టార్ రేటింగ్ పొంది దేశవ్యాప్తంగా రాష్ట్రాల కేటగిరీలో స్వచ్ఛ షహర్‌గా గ్రేటర్ హైదరాబాద్ నిలిచింది. కాగాగత సంవత్సరం గ్రేటర్ హైదరాబాద్ 9వ ర్యాంక్‌తో 5 స్టార్ హోదా పొందగా ఈఏడాది 6వస్థానంలో నిలిచింది. ఈఅవార్డ్ ల స్వీకరణ కార్యక్రమంలో శానిటేషన్ ఏ సి రఘు ప్రసాద్, సాలిడ్ వెస్ట్ మేనేజ్మెంట్ ఎస్ఈ కోటేశ్వరరావు, ఈఈ శ్రీనివాసరెడ్డి, ఏఎస్‌బిఎం యశశ్రీరెడ్డి,శానిటేషన్ సూపర్ వైజర్ సుదర్శన్, శానిటేషన్ కార్యదర్శి ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో కరెంటుతో జాగ్రత్త..

### -అత్యవసర పరిస్థితుల్లో 1921కి కాల్ చేయండి
### -టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండీ ముషారఫ్ ఫరూఖీ



**హైదరాబాద్, జూలై 17,ప్రభాతవార్త:**
విద్యుత్ వినియోగదారులు వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండీ ముషారఫ్ ఫరూఖీ ప్రజలకు సూచించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో సంస్థ పరిధిలోని చీఫ్ ఇంజనీర్, సుపెరింటెండింగ్ ఇంజినీర్లతో గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించి విద్యుత్ సరఫరా పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భముగా సిఎండీ మాట్లాడుతూ ప్రస్తుతం విద్యుత్ సరఫరా అంతా సాధారణంగా వున్నదని, ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అత్యాధునిక సాంకేతితతో కూడిన 212 జిపిఎస్ ఆధారిత ఆటోలు, 101 ఈఆర్‌టి వాహనాలు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీంలు సిద్ధంగా ఉన్నాయన్నారు. వర్షాలు మరో రెండు రోజుల వరకు కురిసే అవకాశమున్నందున జిల్లాల/సర్కిళ్ల సూపెరింటెండింగ్ ఇంజినీర్లు సర్కిల్ కంట్రోల్ రూమ్ నుండి పర్యవేక్షణ చేయాలన్నారు. వాతావరణంలో జరిగే మా ర్పులను నిరంతరం గమనిస్తూ ఎప్పటికప్పుడు సిబ్బందికి ఆదేశాలు జారీ చేయా లని, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. వర్షాలు కురిసే సమయంలో సాధారణ ప్రజలు, విద్యుత్ వినియోగదారులు తమ ఇంట్లోగాని, బహిరంగ ప్రదేశాల్లో విద్యుత్ పరికరాల పట్ల అప్రమత్తంగా ఉండాల ని సూచించారు. కొన్ని సందర్భాల్లో వర్షాల వలన కిటికీల నుండి, వెంటిలేటర్ల నుండి వర్షపు నీళ్లు ఇండ్లలోకి చేరి స్విచ్ బోర్డులలోకి ప్యానెల్‌లోకి చేరే అవకాశ ముంటుందని అది ప్రమాదకరం అన్నారు.విద్యుత్‌కి సంబంధించి ఎలాంటి అత్యవసర పరిస్థితి వున్నా 1912 ఫోన్ చేయాలని ముషారఫ్ తెలిపారు.

## నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో శానిటేషన్ వర్కర్లది కీలకపాత్ర

### -ప్రతి ఒక్కరూ వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి
### -జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి



వైద్యశిభిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హరిచందన దాసరి

**హైదరాబాద్,జూలై 17,ప్రభాతవార్త:**
ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా జిహెచ్ఎంసి పరిదిలో పనిచేసే శానిటేషన్ వర్కర్లు, సిబ్బంది తప్పక వైద్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. గురువారం రెడ్ హిల్స్ లక్ష్మీ నగర్ మున్సిపల్ కమ్యూనిటీ హాల్లో జిహెచ్ఎంసి శానిటేషన్ వర్కర్లకి వైద్య ఆరోగ్యశా ఖ, రోటరీ క్లబ్, ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ శానిటేషన్ వర్కర్లు 389 మంది వివిధ రకాల వైద్య పరీక్షలు చేయించుకొని మందులు తీసుకున్నారని తెలిపారు.అలాగే ఆరోగ్య పరీక్షలు చేసే విభాగాల్లో అధునాతన యంత్రాలు , సిబ్బం దికి ఇచ్చే మందులు తదితర వాటిని కలెక్టర్ పరిశీలించారు. హైదరాబాద్‌ను పరిశుభ్రంగా ఉంచడంలో శానిటేషన్ వర్కర్ల పాత్ర అభినంద నీయమని తెలిపారు. వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రబలకుండా ముందునుండే జాగ్రత్త లు పాటించాలని నిరంతరం ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ తమ ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. ఇక్కడ ఏర్పాటు చేసినశిబిరంలో వైద్యం, బేసిక్ నుండి సూపర్ స్పెషాలిటీ వరకు అందుతుందని తెలిపారు. కాగా స్టాల్స్ లలో పంటి, ఆర్థో, టి.బి, లేప్రసి, బి.పి, షుగర్, గైనిక్, లంగ్స్, వంటి టెస్టులు శానిటేషన్ వర్కర్ల కు వైద్య సేవలను అందించారు. అనంతరం కలెక్టర్ ఎక్స్ రే వాహనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, టీవీ నివారణ అధికారి డాక్టర్ చల్లాదేవి, రోటరీ లీగల్ డిస్ట్రిక్ట్ డాక్టర్ రాజశేఖర్, మా చైర్మన్ డాక్టర్ సునీత కుమార్, కార్పొరేటర్ జాఫర్, తాహసిల్దార్ జ్యోతి, ఏఎంఓ హెచ్ డాక్టర్ రవీందర్ గౌడ్, వైద్యాధికారులు, జిహెచ్ ఎంసి సిబ్బంది పాల్గొన్నారు.

### బాలానగర్ ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం



**హైదరాబాద్, జులై 17 ప్రభాతవార్త**
హైదరాబాద్‌లోని బాలానగర్ పారిశ్రామికవాడలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. డ్యూరో డైన్ ఇండస్ట్రీ లో అగ్ని ప్రమాదం కారణంగా మంటలు భారీగా ఎగిసిపడుతున్నాయి. ఇప్పటికే స్పాట్‌కు 5 ఫైర్ ఇంజన్లు చేరుకొని మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తున్నాయి. మంటలు అదుపు చేసేందుకు ఫైర్ సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. అగ్ని ప్రమాదంలో భారీగా ఆస్తి నష్టం సంభవించినట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన సమయంలో కంపెనీలో ఎవరూ లేకపోవడంతో భారీ ముప్పు తప్పినట్లు అయింది. అయితే ఎంత మేర ఆస్తి నష్టం సంభవించింది అనే విషయంపై ఇంకా స్పష్టత లేదు.

# నగరంలో భారీ వర్షం







**హైదరాబాద్, జులై 17 ప్రభాతవార్త**
నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. మాదాపూర్, హైటెక్‌సిటీ, కొండాపూర్, శేరిలింగంపల్లి, హకీంపేట్, కూకట్‌పల్లి, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, ప్రగతినగర్, కాప్రా, ఈసీఐఎల్, సైనిక్‌పురి, మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్, తిరుమలగిరి, బొల్లారం, బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి, చిలకలగూడ, బేగంపేట, అల్వాల్, ఖైరతాబాద్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. పలుచోట్ల రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల నుం చి వచ్చే ఉద్యోగులు అసౌకర్యానికి కాగా, తెలంగాణలో మూడు రోజు ల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. గురువారం నుంచి శనివా రం వరకు తెలంగాణ వ్యాప్తంగా వానలు కురవనున్నట్లు వెల్లడించింది. గంటల కు 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందిన హెచ్చరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

## టమోటాల లోడుతో వెళ్తున్న డీసీఎం బోల్తా



### రోడ్డుపాలైన టమోటాలు... రైతుల ఆవేదన

**అత్తాపూర్ జూలై 17, ప్రభాతవార్త**
టమోటాల లోడుతో వెళుతున్న డిసీఎం డివైడర్ ను ఢీకొని బోల్తాపడిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాలు ప్రకారం....శంషాబాద్ వైపు నుంచి గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్ కు టమాటాల లోడుతో వెళ్తున్న డీసీఎం అదుపుతప్పి డైరీ ఫార్మ్ దగ్గర పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ ఢీకొని బోల్తా పడింది. ప్రమాదంలో టమాటా బాక్సులు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. అయితే ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. స్థానికులు టమాటాల కోసం ఎగబడ్డారు.పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

## ఏడుగుళ్ల దేవాలయంలో బోనాల ఉత్సవాలు



తలసానికి ఆహ్వాన పత్రిక అందచేస్తున్న సిహెచ్ ఆనంద్‌గౌడ్

**బేగంబజార్,జూలై 17ప్రభాతవార్త:** ఆషాడ మాసాల పండుగ ఉత్సవాలకు మాజీ మంత్రి,శాసనసభ్యులు తలసానిశ్రీనివాస్ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిసి బోనాల ఉత్సవాల పత్రికను నాంపల్లినియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ సిహెచ్ ఆనంద్ కుమార్‌గౌడ్ అందచేశారు. ఈనెల 20వ తేదిన నాంపల్లి నియోజకవర్గంలోని ఏడు గుళ్ల పోచమ్మ ఆలయంలో జరగనున్న బోనాల ఉత్సవాలకు మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను ఆహ్వానం అందచేసినట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ప్రదీప్‌కుమార్‌అగర్వాల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## హెరిటేజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



పురస్కారాలు ప్రదానం చేసిన దృశ్యం

**చిక్కడపల్లి, జూలై 17 ప్రభాతవార్త:** హెరిటేజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పాఠశాల, కళాశాలల విద్యార్థులను, వృద్ధులను గౌరవించాలనే సంకల్పంతో గురువారం రామ్‌నగర్ డివిజన్‌లోని జమిస్తాన్‌పూర్ ఎయిడెడ్ స్కూల్ పిల్లలకు, ఉపాధ్యాయులకు, మూడు, నాలుగు తరాల పెద్దలకు వివిధ అంశాలపై పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ డైరెక్టర్ విశాలాక్షి, నిర్వాహకులు ప్రభాకర్‌రెడినడ, తెలంగాణ స్త్రీసేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ గురజాడ శోభాపేరిందేవి, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు. మూడు తరాల మధ్య బాంధవ్యం బాగుండేలా పెద్దల కి పిల్లలు సాయపడుతూ వార్ధక్యం లో వారికి తోడుగా ఉండేలా రెండో తరం వారూ మూడో తరం వారు పరస్పరం సహకరించుకోవాలని వక్తలు పేర్కొన్నారు. మూడు తరాల నాట్య కారిణిలు శ్రీమతి లలితా రామస్వామి, కుమూరి, ఆమె కుమార్తె, అమ్మాయి మనవరాలకు నగదు బహుమతి అందించగా, నాలుగు తరాలు కలిసికట్టుగా ఉన్న నాగమణి కుటుంబ సభ్యులకు రెండవ బహుమతి అందించారు. మొదటి బహుమతిగా దుప్పటి, రెండో బహుమతి గా గొడుగును మూడో బహుమతిగా తువ్వాలను అందించారు. ఉత్తమ తాతమ్మ పురస్కారం కిరీటం, తాతముత్తాతల తో అనుబంధం అంశం పై చిత్రాలు గీచిన పిల్లలకి బహుమతులు అందించగా,పాల్గొన్న అందరికీ కలాలు , స్కూల్ టాప్‌లో ఉన్న అమ్మాయిలకు బహుమతులు అందుకున్నారు.

## ప్రభుత్వం ఉద్యమకారుల డిమాండ్లను అమలు చేయాలని అంబేద్కర్ విగ్రహానికి వినతి



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేస్తున్న జెఏసి నాయకులు

**సైఫాబాద్, జూలై 17 ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ గురువారం ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి తెలంగాణ ఉద్యమకారుల జెఏసి ప్రతినిధి బృందం వినతి పత్రం సమర్పించింది. ఈ సందర్బంగా జెఏసి ఛైర్మన్ సుల్తాన్ యాదగిరి మాట్లాడుతూ తెలంగాణ తొలిదశ ఉద్యమంలో తూటాలకు 369 మంది బలికాగా, మలిదశ ఉద్యమంలో 1200 మంది ఆత్మబలిదానాలు చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు 250 గజాల స్థలం, ప్రతి నెల 30 వేలు పెన్షన్ తదితర డిమాండ్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జెఏసి నాయకులుగుండా యాదగిరి, శ్రీను, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు మెరుగైన వైద్యం : ఎమ్మెల్యే తలసాని



ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**సంజీవరెడ్డి నగర్, జూలై 17 ప్రభాతవార్త:** పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించే సమయాలలో అందుబాటులో ఉంటానని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో అమీర్‌పేట డివిజన్ పి.జె. ఆర్.నగర్‌కు చెందిన ఊరాధి లక్ష్మికి మెరుగైన వైద్యం కోసం ముఖ్య మంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన 2 లక్షల రూపాయల ఎల్.ఓసి పత్రాన్ని అందజేశారు. లక్ష్మి గత కొంత కాలంగా బ్రేన్ సంబంధిత సమస్యతో బాధపడుతుంది. చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం కోసం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఆశ్రయించగా ఆయన చొరవతో 2 లక్షల రూపాయల ఆర్థిక సహాయం మంజూరు కాగా ఆమె కుమార్తెకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అమీర్‌పేట డివిజన్ మాజీ కార్పోరేటర్ సామన శేషుకుమారి, సనత్ నగర్ డివిజన్ కార్పోరేటర్ కొలను లక్ష్మి బాల్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి, హన్మంతరావ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అశోక్ యాదవ్, నామన సంతోష్ యాదవ్, కూతురు నర్సింహ్మా, కట్ట బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయంలో పరిశుభ్రత పాటించాలి



ఈదమ్మ దేవాలయం వద్ద అపరిశుభ్రంగా ఉన్న వాటిని శుభ్రం చేయిస్తున్న కార్పోరేటర్ వనం సంగీత యాదవ్

**సంజీవరెడ్డి నగర్, జూలై 17 ప్రభాతవార్త:** అషాడమాసం జూలై 20వ తేదీన ఆదివారం హైదరాబాద్ నగరంలో జరిగే బోనాల పండుగను పురస్కరించుకొని సోమాజిగూడ డివిజన్ పరిధిలోని శ్రీనగర్ కాలనీ ఈదమ్మ దేవాలయంలో పరిశుభ్రత పాటించాలని, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సోమాజిగూడ డివిజన్ కార్పోరేటర్ వనం సంగీత యాదవ్ సూచించారు. శ్రీనగర్ కాలనీలో పర్యటించిన ఆమె బోనాల సందర్భంగా పరిసర ప్రాంతాల్లోని వ్యవర్థాల వలన వచ్చే భక్తులకు అ సౌకర్యాలు కలుగకుండా పరిశుభ్రంగా ఉంచాలని జిహెచ్ఎంసి అధికారులకు కోరారు.

## తెలుగు సాహిత్యంలో సంచలనం గుడిపాటి వెంకట చలం



ప్రసంగిస్తున్న సాహితీ కిరణం పత్రిక సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు

**చిక్కడపల్లి, జూలై 17 ప్రభాతవార్త:** సంప్రదాయం నేపథ్యం గా తెలుగు సాహిత్యం విస్తరిస్తున్న తరుణం లో ఆచారాలు అప్పటి వరకూ స్త్రీ లపై వున్న ఆంక్షల ను ధిక్కరిస్తూ సంచలనం సృష్టించిన వారు గుడిపాటి వెంకట చలం అని సాహితీ కిరణం పత్రిక సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు అన్నారు. గురువారం ఎందరో మహానుభావులు మధురస్మృతులు కార్యక్రమంలో భాగంగా త్యాగరాయ గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళా విఎస్ జనార్ధన మూర్తి అధ్యక్షతన సుప్రసిద్ధ తెలుగు రచయిత, గుడిపాటి వెంకటాచలం యాదిలో కార్యక్రమంలో గానసభలోని కళా సుబ్బారావు కళావేదికలో జరిగింది. ప్రధాన వక్త గా పాల్గొన్న పొత్తూరి సుబ్బారావు మాట్లాడుతూ ఇరవైవ దశాబ్దం లో స్త్రీ హక్కులు స్వేచ్ఛ అంశాలుగా రచనలు చేసిన వారు చలం అని చెప్పారు. చలం రచనలు చాలా వరకు స్త్రీల జీవితాలను ఇతివృత్తంగా చేసుకుని ఉంటాయని, ముఖ్యంగా సమాజంలో వారికి ఎదురయ్యే శారీరక, మానసిక హింసలు, వాటిని వారు ఎదుర్కొనే విధానాలుంటాయని, మొత్తంగా ఆయన రచనలలో ఇతివృత్తమూ, తాత్వికతా, రచనాశైలీ ఆయనకు ఆధునిక తెలుగు రచనా రంగంలో అనన్యమైన స్థానాన్ని సంపాదించిపెట్టాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్ అధినేత గుదిబండి వెంకట్ రెడ్డి, ప్రముఖ సంఘసేవకులు పీఎస్ ఆర్ మూర్తి, సిద్దేంద్ర ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షురాలు దేవసేన, ప్రముఖ గాయకుడు శ్రీధరం రామసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## కల్తీ పేరిట రాష్ట్రంలో కల్లును నిషేదించే కుట్ర : అమరవేణి నర్సాగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న నర్సాగౌడ్, సిద్ధిరాములుగౌడ్, కిరణ్ గౌడ్ తదితరులు

**హైదరాబాద్, జూలై 17, ప్రభాతవార్త:** కల్తీకల్లుపేరిట రాష్ట్రంల కల్లును నిషేదించే కుట్ర జరుగుతుందని మోకుదెబ్బ జాతీయ అధ్యక్షులు అమరవేణి నర్సాగౌడ్ ఆరోపించారు. ఈమేరకు గురువారం హైదరాబాద్ లోని మోకుదెబ్బ రాష్ట్ర కార్యాలయంలో గౌడజన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగుల కిరణ్ కుమార్ గౌడ్ అధ్యతన జరిగింది. ఈ సమావేశానికి జాతీయ అధ్యక్షులు, తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్, జాతీయ సెక్రెటరీ జనరల్ రాగుల సిద్ధి రాములు గౌడ్, జాతీయ ప్రధాన కార్యదర్శి కొండాపురం బాలరాజ్ గౌడ్, జాతీయ కోశాధికారి తిజు బాలేషం గౌడ్, జాతీయ అధికార ప్రతినిధి హైకోర్ట్ న్యాయవాది బాలసాని సురేష్ గౌడ్, జాతీయ ఉపాధ్యక్షులు ముత్యం నర్సింహులు గౌడ్‌లు ప్రసంగించారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ ఇటీవల కల్తీ కల్లు తాగి మరణించిన నిరుపేద ప్రజలకు ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలియజేస్తున్నాం ఇలాంటి సంఘటన జరగడం దురదృష్టకరం అన్నారు. ఈ సంఘటనకు భాద్యులు ఐన వారిపైన కఠిన చర్యలు తీసుకోని మృతి చెందిన కుటుంబాలకు ఒక్కొక్కరికి 50 లక్షల నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అయితే ఎక్కడో ఒక్క దగ్గర జరిగిన సంఘటనను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర వ్యాప్తంగా కల్లు దుకాణాలపై కల్తీ పేరిట దాడులు చేస్తూ అక్రమ కేసులు పెడుతూ గీత కార్మికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ప్రభుత్వంలోని కొంతమంది పెద్దలు లిక్కర్ లాబీలో పడి కల్తీ పేరిట కల్లును నిషేదించి గౌడ కులస్తులను రాజకీయంగా అణిచివేయాలంటే ఆర్థిక మూలాలను దెబ్బకొట్టాలని చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనంతుల రమేష్ గౌడ్, రాష్ట్ర నాయకులు పచ్చిమడ్ల స్వామి గౌడ్, కొండగొని రవీందర్ గౌడ్, ఆంజనేయులు గౌడ్, రాజేందర్ గౌడ్ లతో పాటు తెలంగాణ జిల్లాల అధ్యక్షులు, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు

## ద్విచక్రవాహనాల దొంగ అరెస్టు



ద్విచక్రవాహనాల దొంగను అరెస్టు చేసిన పోలీసులు

**చిక్కడపల్లి, జూలై 17 ప్రభాతవార్త:** ద్విచక్రవాహనాలను దొంగిలిస్తూ పోలీసుల నుంచి తప్పించుకు తిరుగుతున్న ఓ వ్యక్తిని చిక్కడపల్లి పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కర్నూలు నగరానికి చెందిన కుడుముల మధుసూదన్‌రెడ్డి (44) ప్రస్తుతం కడప జిల్లా యర్రగుంట్ల గ్రామంలో నివవాసమంటున్నాడు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బును సంపాదించాలనే ఆశతో హైదరాబాద్ నగరానికి చేరుకుని దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. ఇప్పటి వరకు చిక్కడపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో పల్సర్ ద్విచక్రవాహనం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుచానూర్, ఈస్ట్ తిరుపతి పోలీసుస్టేషన్ పరిధిలో రెండు ద్విచక్రవాహనాలు, దోమలగూడ పోలీసుస్టేషన్ పరిధిలో మరో వాహనాన్ని దొంగిలించాడు. ఇదే సమయంలో ధాన్యాసి రాంబాబు అనే వ్యక్తి ఈ నెల 10వ తేదీన జవహర్‌నగర్ ఎస్సార్టీ ప్రాంతంలో నివాసముంటున్న తన చెల్లెలు నివాసానికి తన ద్విచక్రవాహనంపై వెళ్లాడు. ఇంటి ముందు పార్కు చేసిన అనంతరం తిరిగి వచ్చిచూసేసరికి కనిపించలేదు. దొంగతనానికి గురైన వాహనం కోసం గాలించినా కూడా ఫలితం లేకపోవడంతో చిక్కడపల్లి పోలీసుస్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. డిఐ శంకర్, ఎస్ఐ ఎల్.మౌనిక నేతృత్వంలో బృందాన్ని ఏర్పాటు చేసిన పోలీసులు 30 సీసీ కెమెరాలు, అనుమానిత వ్యక్తులను, ఇతర మార్గాల ద్వారా విచారణ జరిపించారు. ఫలితంగా మధుసూదన్‌రెడ్డి అనే వ్యక్తి దొంగతనాలకు పాల్పడుతున్న గుర్తించి, అరెస్టు చేసి అతడి వద్ద నుంచి నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ రాజునాయక్, డిఐ ఎం.శంకర్ పర్యవేక్షణలో, ఎస్ఐ ఎల్.మౌనిక కేసును నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహించారు.

## ఎటిఎం చోరీ దొంగలముఠా అరెస్ట్

### రూ 17లక్షల నగదు, 4 ద్విచక్రవాహనాలు, గ్యాస్ కటింగ్ మిషన్ల స్వాధీనం



ఎటిఎం చోరీ వివరాలను వెల్లడిస్తున్న బాలానగర్ డిసిపి సురేశ్‌కుమార్ తదితరులు

**కుత్బుల్లాపూర్, జూలై 17 ప్రభాతవార్త** ఒకవైపు పోలీసుల కార్డన్‌సర్చ్ జరుతున్న ప్రాంతానికి కూతవేటు దూరంలో గల ఎటిఎంలో గ్యాస్‌కట్టర్ ద్వారా చోరీకి పాల్పడి సవాల్ విసిరిన ముగ్గురు అంతరాష్ట్ర దొంగల ముఠాను జీడిమెట్ల పోలీసులు ఛేదించారు. హార్యానా, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలోని పలు నేరాలలో పాల్గొని అక్కడినుండి శిక్ష తప్పించుకునేందుకు జైలులోనే పథకాలను రూపొందించి ఎటిఎంల దొంగతనాలకు శ్రీకారం చుట్టిన అంతరాష్ట్ర దొంగలముఠాను ఎట్టకేలకు పట్టుకుని చోరీచేసిన రు.లు. 34లక్షల 71వేల నగదుకు గాను 17లక్షల నగదును వారినుండి స్వాదీనం చేసుకుని వారిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. బాలానగర్ డిప్యుటీ పోలీసు కమిషనర్ సురేశ్‌కుమార్, ఎసిపి నరేశ్‌రెడ్డి, సర్కిల్‌ఇన్‌స్పెక్టర్లు ఎస్.కనకయ్య, జీడిమెట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గడ్డంమల్లేశ్‌లు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల9వ తేదీరాత్రి గాజులరామారం మార్కండేయనగర్‌లో గల ఒకే సెంటర్‌లోని ఎటిఎం సెంటర్లలో ఈ దొంగతనానికి పాల్పడినట్లు తెలిపారు. హార్యాన, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ముఠా ఈ నేరాలకు పాల్పడినట్లు నిర్ధారించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన యాసిన్ హుసేన్, ఎం.డి. ఆబేద్, అమీద్ అన్సారీలు పరిచయమయ్యారు. యాసిన్‌హుసేన్ స్థానికంగా ఒక ఫోక్సో కేసులో నిందితుడిగా శిక్షపడి అక్కడి నుండి తప్పించుకునేయత్నంలో జైలులో ఎం.డి. ఆబేద్, అమీద్ అన్సారీలతో పరిచయంఏర్పడి హైదరాబాద్ నగరానికి వచ్చి బేగంపేట్ ప్రకాశ్‌నగర్‌లోని బాయ్స్ హాస్టల్‌లో దిగారు. స్థానికంగా గ్యాస్ సిలిండర్, కట్టర్ మిషన్‌ను కొనుగోలుచేసి ఎటిఎంలపై గురిపెట్టారు. ఎటిఎం కేంద్రాలలో ఏవైర్లను, ఏప్రాంతంలో కత్తిరిస్తే సైరన్ మోగదనే విషయంపై వీరు ముందే అవగాహణ కల్పించుకుని ఖచ్చితంగా ఆదేప్రాంతంలోని వైర్లను కట్‌చేసి హెచ్‌డిఎఫ్‌సి ఎటిఎం క్యాష్‌బాక్సులో గల రు.లు. 34 లక్షల70వేల నగదులో హార్యానకు తరలివెళ్లారు. అప్పటి నుండి నేరస్థులకోసం గాలిస్తున్న బాలానగర్ డివిజనల్ పరిధిలోని పోలీసులు ఏడు బృందాలుగా ఏర్పడి వివిధ ప్రాంతాలలోని మొత్తం సిసి పుటేజీల తనిఖీచేసి దొంగలు హార్యాన, మధ్యప్రదేశ్‌లకు వెళ్లిపోయినట్లు గుర్తించారు. నిందితులు గతంలో 30కి పైగా ఎటిఎం చోరీలు, ఇంళ్లతాళాలను పగలగొట్టి చోరీచేసే విషయాలో కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. ప్రత్యేకంగా నియమించబడ్డ ఏడు పోలీసు బృందాలు ఎట్టకేలకు చోరీలకు పాల్పడిన ముగ్గురుని అదుపులోకి తీసుకుని వీరివద్ద మిగిలిన రు.లు. 17లక్షల రూపాయలను స్వాదీనం చేసుకోవడం తో పాటు చిన్న గ్యాస్ సిలింగర్, గ్యాస్ కటింగ్ మిషన్, నాలుగు దిచక్ర వాహనాలను స్వాదీనం చేసుకుని వీరిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. ఈమేరకు ప్రత్యేక ప్రతిభ, శ్రద్ద కనబర్చిన పోలీసు అధికారులకు బాలానగర్ డివిజన్ పోలీసు కమిషనర్ సురేశ్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో క్రైమ్ డిసిపి ముత్యం రెడ్డి, సిసిఎస్ అడిసనల్ డిసిపి పి.సత్యనారాయణ, బాలానగర్ అడిషనల్ డిప్యుటీ పోలీసు కమిషనర్ సత్యనారాయణ, ఎసిపి పి.నరేశ్‌రెడ్డి, క్రైమ్ ఎసిపి వై.నాగేశ్వర్‌రావు, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ దాల్‌నాయుడు, ఎం.పవన్, బాలానగర్ డిఐ నాగిరెడ్డిలు పాల్గొన్నారు.

## గంధంగూడలో ఎస్‌టిపి ప్లాంట్లు పెట్టవద్దని వినతి



గంధంగూడలో ఎస్‌టిపి ప్లాంటును ఏర్పాటు చేయవద్దని కోరుతూ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

**నార్సింగి, జూలై 17 ప్రభాతవార్త** : బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని గంధంగూడలో ఎస్‌టిపి ప్లాంటును పెట్టవద్దని కోరుతూ గురువారం కాంగ్రెస్ నాయకులు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్బంగా బండ్లగూడ కార్పోరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు పి.కృష్ణారెడ్డి, మాజీ కార్పోరేటర్ తలారి చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ విఘ్నేశ్వర కాలనీ, బృందావన్‌కాలనీ, కేకే-2, దత్తాత్రేయ కాలనీల మధ్యన జల మండలి అధికారులు ఎస్‌టిపిని పెట్టేందుకు ప్రణాళికలు రూపొందించడంను వెంటనే విరమించుకోవాలన్నారు. వందలాది మంది ప్రజలు ఉంటున్న ఈ ప్రాంతంలో ఎస్‌టిపి ప్లాంటును ఏర్పాటు చేస్తే వాతావరణ కాలుష్యం, శబ్దకాలుష్యం ఏర్పడుతుందని, స్థానిక ప్రజలు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతారన్నారు. ప్రజలు లేని ప్రాంతాలలో ఈ ఎస్‌టిపిలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరామని తెలిపారు. వినతిపత్రం చదివిన తరువాత రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజలు ఇబ్బందులు పడకుండా నావంతు కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే స్పందన పట్ల కాలనీల ప్రజలు, కాంగ్రెస్ నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి ప్రేమ్ కుమార్, నాయకులు హరీష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## కట్టమైసమ్మ బోనాల ఉత్సవాలకు సర్వం సిద్ధం

### 20న బోనాలు, 21న రంగం
### వివరాలు వెల్లడించిన ఆలయ వ్యవస్థాపక కమిటీ ఛైర్మన్ గౌతంకుమార్ పటేల్



కట్టమైసమ్మ బోనాల పోస్టర్‌లు ఆవిష్కరిస్తున్న ఆలయ ఛైర్మన్ గౌతంకుమార్ పటేల్, ఈవో సాంబశివరావు, అర్చకులు సాత్వికశర్మ

**ముషీరాబాద్, జూలై 17, ప్రభాతవార్త:** నగరంలో ప్రసిద్ధిగాంచిన లోయర్‌ట్యాంక్‌బండ్ కనకాల కట్టమైసమ్మ బోనాల ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని దేవాలయ వ్యవస్థాపక కమిటీ ఛైర్మన్ గౌతంకుమార్ పటేల్ తెలిపారు. గురువారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన ఆలయ ఈవో సాంబశివరావు, ప్రధాన అర్చకులు సాత్వికశర్మలతో కలసి బోనాలకు సంబంధించిన బ్రోచర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో జరిగే పూజా కార్యక్రమాలను వివరించారు. 20వ తేదీ బోనాల సందర్భంగా ఉదయం 3.30 నిమిషాలకు పంచామృతాభిషేకం, ప్రత్యేక సుగంధ పూరిత పుష్పాలంకరణ, బాలభోగం అనంతరం, అమ్మవారి నిత్య దర్శనం ఉంటుందని అన్నారు. మధ్యాహ్నం నిషాపూజ, బలిహరణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం రంగం సందర్భంగా తెల్లవారుఝామున పంచామృత అభిషేకంతో పాటు రక్షాక్షి అలంకరణ, అనంతరం బాలభోగం, అమ్మవారి దర్శనం ఉంటాయని అన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు స్థానికంగా ఉన్న పింగళి వెంకట్రామిరెడ్డి హాలు నుంచి ఘటోత్సవం, మధ్యాహ్నం 3 గంటలకు గంగతెప్పోత్సవం పూజ, సాయంత్రం ఆరు గంటలకు గావు కళ్యాణం, ఏడు గంటలకు రంగం, 8 గంటలకు పోతరాజుల విన్యాసం ఉంటాయని వివరించారు. నగరంలో ఏ దేవాలయంలో నిర్వహించని విధంగా, ఎంతో అద్భుతంగా ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, కట్టమైసమ్మ బోనాలు అంటే నగరంలోని దూర ప్రాంతాల నుండి కూడా భక్తులు తరలి వస్తారు కాబట్టి, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. దేవాలయాన్ని విద్యుద్దీపాలతో, పూలతో అలంకరించటమే కాకుండా, మొక్కులు తీర్చుకునే భక్తులకు సమీపంలో తాత్కాలిక షెడ్లను ఏర్పాటుచేస్తున్నామన్నారు. బోనాలు ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు భక్తులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు.

## బంజారాహిల్స్ నాలాలను పరిశీలించిన హైడ్రా కమిషనర్



నాలాప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ ఏ.వి.రంగనాథ్

**హైదరాబాద్, జూలై 17, ప్రభాతవార్త:** బంజారా హిల్స్ నాలాలను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం పరిశీలించారు. రోడ్డు నంబరు 14, లలో తలెత్తుతున్న వరద సమస్యకు గల కారణాలను క్షేత్ర స్థాయిలో తెలుసుకున్నారు. రోడ్డు నంబరు 3లోని జ్యోతినెస్ట్ నివాసితులు ఫిర్యాదు చేయడంతో రంగనాథ్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కేబీఆర్ పార్కు, నందినగర్ మీదుగా బంజారాహిల్స్ నుంచి జలగం వెంగళరావు పార్కులోని చెరువులోకి చేరే వరద కాలువను పరిశీలించారు. పైన 4 మీటర్ల వెడల్పుతో ఉన్న నాలా రోడ్‌నెంబర్ 3 వద్దకు వచ్చేసరికి కొన్నిచోట్ల 2 మీటర్లకే పరిమితమవ్వడాన్ని చూశారు. రోడ్డు నంబరు 14తో పాటు 3 లోనూ నాలాలు కుంచించుకుపోవడాన్ని గుర్తించారు. పైన 4 మీటర్ల వెడల్పుతో ఉన్న బాక్సు డ్రైన్ రోడ్డు నంబరు 3కి వచ్చేసరికి 2 మీటర్ల వెడల్పునకు పరిమితమైంది. అలాగే ఒక మీటరు వెడల్పు ఉన్న పైపు లైను ఏర్పాటు చేయడంతో ఎగువ నుంచి భారీ మొత్తంలో వస్తున్నవరద పోటెత్తే పరిస్థితి ఏర్పడుతోందని కమిషనర్‌కు అధికారులు చెప్పారు. బఫర్ లేకుండా చేయడమే కాకుండా నాలాను కూడా ఆక్రమించడం పట్ల కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పైనుంచి చివరి వరకూ నాలా వెడల్పును పరిశీలించి వరద ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

### ఆషాడ బోనాల మహోత్సవంలో పాల్గొన్న జనసేన నాయకులు

**కెపిహెచ్బి కాలనీ, జూలై 17, ప్రభాతవార్త** కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని సంగీత్ నగర్ శ్రీ శ్రీ శ్రీ నల్లపోచమ్మ తల్లి దేవాలయ ధర్మకర్త కొమ్ము సత్తయ, అధ్యక్షుడు కొమ్ము రాజ ఆహ్వానం మేరకు జనసేన పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గం ఇంచార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ బోనాల జాతర సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ బోనాల జాతరలో జనసేన నాయకులు కొల్లా శంకర్, పోలెబోయిన శ్రీనివాస్, పులగం సుబ్బు, దేవాలయ కమిటీ సభ్యులు శంకర్ రెడ్డి, డి.రాజు, ఎం.చంద్రకాంత్, ఎం. కృష్ణయ్య, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



వట్టినాగులపల్లిలో జరిగిన పోచమ్మ బోనాల వేడుకలలో పాల్గొన్న పుర ప్రముఖులు గొల్ల నాగేష్ యాదవ్, భగవాన్‌సింగ్, కిషోర్ యాదవ్, అరుణ్ కుమార్ ముదిరాజ్ తదితరుల దృశ్యం.

### వినాయకనగర్‌లో పర్యటించిన కార్పొరేటర్



బస్తీలో పర్యటిస్తున్న రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి

**మైలార్‌దేవ్‌పల్లి, జూలై 17 ప్రభాతవార్త :** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని వినాయకనగర్‌లో నూతనంగా నిర్మించనున్న సిసి రోడ్డు పనులను రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి గురువారం జిహెచ్ఎంసి, వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. మిగిలిన సిసి రోడ్డు పనులకు ఎస్టిమేషన్ వేసి త్వరగా పనులు ప్రారంభించాలని ఆయన అధికారులను ఆదేశించారు. సాయిబాబా నగర్‌లో భూగర్భ డ్రైనేజి పైప్ లైన్ వ్యవస్థ చెడిపోవటంతో అధికారులతో కలిసి కాలనీలో ఆయన పర్యటించి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏఈ నరసిహమూర్తి, జలమండలి సూపర్ వైజర్ లోక్ నాథ్ రెడ్డి, శశిధర్ రెడ్డి, సంతుగౌడ్, భూషణ్, నర్సింగ్ ముదిరాజ్, లోకేష్, దత్తు భాయ్, బాబూలాల్, మన్మోహన్ రెడ్డి, అశోక్, దేవేందర్ యాదవ్, రమేష్ అనిల్, బబ్లూ, శంకర్ రెడ్డి, శ్రీ కాంత్ రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

### వైభవంగా సామూహిక సహస్రనామ కుంకుమార్చన కార్యక్రమం

**చార్మినార్, జూలై 17 ప్రభాతవార్త :** ఆషాడ మాసం బోనాల జాతర ఉత్సవాలు సందర్భంగా గురువారం మీరాలంమండి శ్రీ మహంకాళీ ఆలయంలో మాతృ మూర్తులచే సామూహిక సహస్రనామ కుంకు మార్చన, పంచ హారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి, కాగా మీరాలం మండి శ్రీ మహంకాళీ ఆలయంలో అత్యంత వైభవంగా బోనాల జాతర ఉత్సవాలు జరుగుతున్నాయని దేవాలయం కమిటి అధ్యక్షులు గాజుల అంజయ్య తెలిపారు.

### 19న జాబ్ మేళా

**హైదరాబాద్, జూలై 17 ప్రభాతవార్త**

నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు భారత్ సేవ కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ అడప వెంకట్ రెడ్డి తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఎంబీఏ అర్హత కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఇది పూర్తి ఉచింగా నిర్వహించడం జరుగుతుందని, జాబ్ మేళాలో పాల్గొనే వారు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. పంజాగుట్ట, ద్వారకాపురి కాలనీలోని రాజేశ్వరి టవర్స్‌లో 19వ తేదీన శనివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాబ్ మేళా జరుగుతుందని, వివరాలకు సెల్: 8179955744కు సంప్రదించవచ్చుని ఆయన పేర్కొన్నారు.

### భర్త వేధింపులు తట్టుకోలేక భార్య ఉరివేసుకొని ఆత్మహత్య..

**పేట్ బషీరాబాద్, జూలై 17, ప్రభాతవార్త**

భర్త వేధింపులు తట్టుకోలేక భార్య ఉరివేసుకొని మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మెదక్ జిల్లా చిన్న శంకరం పేట మండలం కవ్వల పల్లి గ్రామానికి చెందిన పూసల నాగరాజ్, జ్యోతి దంపతులు. మూడు సంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం వలస వచ్చి దూలపల్లిలోని అయ్యప్ప 60 గజాల్లో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరు ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. వీరికి 2018లో పెళ్లయింది. భర్త నాగరాజ్ అనుమానంతో పాటు డబ్బులు తేవాలని వేధించడంతో మనస్థాపానికి గురయిన భార్య జ్యోతి ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

### సేవా..మానవత్వం..అంతకుమించి ఆనందం

- రోటరీక్లబ్ అధ్యక్షురాలు నీరజా గోదావర్తి



విద్యార్థినికి నిత్యావసర కిట్‌ను అందజేస్తున్న రోటరీ క్లబ్ అధ్యక్షురాలు నీరజా గోదావర్తి

**హైదరాబాద్, జూలై17, ప్రభాతవార్త:** సేవ చేయడం ప్రతి ఒక్కరు అలవరచుకోవాలని, ఇది మానవత్వంతో పాటు ఎంతో ఉత్సాహం దాగి ఉందని రోటరీక్లబ్ ఆఫ్ బంజారాహిల్స్ అధ్యక్షురాలు నీరజా గోదావర్తి అన్నారు. ఆ శాఖ 'హెల్పింగ్ హ్యాండ్స్' ప్రాజెక్ట్ ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం విజయనగర్ కాలనీ సేవా సమాజం బాలికా నిలయంలో సేవా ప్రాజెక్టుల డైరెక్టర్ రోటేరియన్ దుర్గాప్రసాద్ మడను ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేవలు అందించడం దైవనిర్ణయమని, కష్టాల్లో ఉన్నవారికి ఆపద్బాంధువులు సాక్షాత్తు భగవంతుని రూపమన్నారు. జీవితకాల గమనంలో సేవాదృక్పథాన్ని అలవరుచుకోవాలని తెలిపారు. అనంతరం 55మంది బాలికలకు ఆమె దుస్తులు, నిత్యావసర వస్తువులను అందజేశారు. కార్యక్రమానికి సహకరించిన రోటేరియన్ రమేష్ కుమార్, అర్చనలు, వారి కుటుంబాలకు కృతజ్ఞతలు తెలిపారు.

### బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచందర్‌ను సత్కరించిన నేతలు



రామచందర్‌ను సత్కరిస్తున్న బీజేపీ నేత అజిత్ సేనాపతి,పార్టీ కార్యకర్తలు

**శేరిలింగంపల్లి, జూలై 17 ప్రభాతవార్త.** తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులుగా నూతనంగా నియమితులైన ఎన్.రామచందర్‌ను శేరిలింగంపల్లి అసెంబ్లీ బీజేపీ సీనియర్ నాయకులు, జిల్లా బీజేపీ స్పోక్స్ పర్సన్ అజిత్ సేనాపతి, బీజేపీ స్థానిక నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పీఠం అధిరోహించిన రామచందర్‌ను బీజేపీ శేరిలింగంపల్లి నియోజక వర్గ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. నియోజకవర్గంలో బీజేపీ పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని నూతన అధ్యక్షులు సూచించినట్లు అజిత్‌సేనాపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రైవేటు ట్రావెల్ బస్సు డ్రైవర్‌పై దాడి... ముగ్గురు అరెస్ట్

**హైదరాబాద్, జూలై 17, ప్రభాతవార్త:** బస్సులో సిగరెట్ తాగొద్దనందుకు ప్రైవేటు ట్రావెల్ బస్సుడ్రైవర్, క్లీనర్‌పై దాడికి పాల్పడిన ముగ్గురిని మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాలుగు రోజుల క్రితం కాచిగూడ నుంచి రాజస్థాన్‌కు వెళుతున్న ఓ ప్రైవేట్ బస్సులో పూనా రామ్ అనే ప్రయాణికుడు సిగరెట్ వెలిగించాడు. అసౌకర్యం కలుగుతుందని తాగొద్దని బస్సు డ్రైవర్, క్లీనర్ సదరు ప్రయాణికుడికి సూచించడంతో వాగ్వివా దం చోటుచేసుకుంది. స్నేహితులను ఫోన్‌ద్వారా పిలిపించి డ్రైవర్, క్లీనర్‌పై ముకుమ్మడి దాడికి చేసి లక్ష నగదు, సెల్ ఫోన్ ఎత్తుకెళ్లారు. పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తుచేపట్టి ముగ్గురిని రిమాండ్‌కు తరలించగా మరో ముగ్గురిని గాలింపు చర్యలు చేపడుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## పారిశుద్ధ్య నిర్వహణ మెరుగ్గా ఉండేలా చర్యలు : కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి



పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి తదితరులు

**మలక్ పేట ,జూలై 17, ప్రభాతవార్త :** బోనాల పండుగను పురస్కరించుకుని దేవాలయాల వద్ద పారిశుద్ధ్య నిర్వహణ మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలని ముసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్ లోని పలు ప్రాంతాలలో శానిటేషన్ విభాగం సిబ్బందితో కలిసి బోనాల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించి పారిశుద్ధ్య నిర్వహణ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోనాల పండుగ విశిష్టమైన పండుగని ఆలయాల వద్ద పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఇబ్బంది కలుగకుండా ఆలయ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆలయాల వద్ద చెత్త,చెదారం వంటి వ్యర్థాలు లేకుండా తొలగించాలని సిబ్బందికి సూచించారు . ఈ కార్యక్రమంలో శానిటేషన్ జవాన్ రాజు, సూపర్ వైజార్లు గణేష్, సుభాష్, శ్రీనివాస్, కళ్యాణ్ ,దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి



వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజకు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

**మలక్ పేట, జూలై 17, ప్రభాతవార్త:**
ఎస్ ఆర్ డి విషయంలో డిడబ్ల్యువోస్, అడిషనల్ డైరెక్టర్లు అన్ని జిల్లాల అధికారులతో డైరెక్టర్ సమక్షంలో అతి త్వరలో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ సాదన పరిరక్షణ సమితి సభ్యులు వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజకు వినతిపత్రాన్ని సమర్పించారు. నల్గొండ చౌరస్తాలోని వికలాంగుల సంక్షేమ శాఖ కార్యాలయంలో డైరెక్టర్ ను కలిసిన వారు పలు సమస్యలను డైరెక్టర్ కు విన్నవించారు. ఓహెచ్ రోస్టర్ పాయింట్ 10 లోపు మార్చుటకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి నివేదిక పంపాలని, డ్రెస్ కోడ్ ఉద్యోగాల్లో 4 శాతం రిజర్వేషన్లు తప్పకుండా కల్పించేలా ప్రభుత్వానికి ఉత్తరం రాయాలని వారు కోరారు. వికలాంగుల సంక్షేమ శాఖను స్వతంత్ర శాఖగా ఏర్పాటు చేసి 33 జిల్లాల్లో ఏడీ ఆఫీసులు తెరవాలని, టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసి ఎస్ఆర్డి వెరిఫికేషన్ చేయాలని వారు అన్నారు. వికలాంగుల సంక్షేమ శాఖ కార్పొరేషన్ లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని వారు విన్నవించారు. ఈ కార్యక్రమంలో సదన పరిరక్షణ సమితి సభ్యులు ఎం. శ్రీనివాసులు, అంజయ్య, దానమ్మ, అలివేలు,ఎల్ .రేఖ, రాజేశ్వరి, శ్రీలత,సృజన్ బాబు,స్వరూప,వేణు,అంజలి,లక్ష్మి, పాల్గొన్నారు.

## బోనాల పండగకు సంబంధించి సమీక్షా సమావేశం



**తుర్కయంజాల్ జులై 17, ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో సమగ్ర సమీక్ష సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ సమావేశంలో మున్సిపాలిటీ కమిషనర్ కే అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ వివిధ వార్డ్ అధికారులు, జవాన్ లు, ఎలక్ట్రీషియన్స్ లతో సమావేశం నిర్వహించి త్వరలో జరగబోయే బోనాల పండగ కు సంబంధించి పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని కాలనీలో పోచమ్మ ఎల్లమ్మ గుడిలు ఉన్న ప్రాంతాల్లో పిచ్చి మొక్కలు తొలగించాలని రోడ్ల పై మట్టి ఉండకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ వీధి లైట్లు పని చేసేలా ఏర్పాట్లు చేయాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని అన్ని కాలనీ లలో పారిశుద్ధ్య పనులు,దోమల నివారణ చర్యలు మురికి కాలువల్లో ఆయిల్ బాల్స్ వేయాలని,ఫాగింగ్ చేపట్టాలని కమిషనర్ సిబ్బందిని ఆదేశించారు.. ఈ సమావేశం లో డి ఈ భిక్షపతి, ఏ ఈ చంద్ర శేఖర్ రెడ్డి, ఆర్ ఓ శ్రీనివాసులు ఎస్ ఐ వినయ్ కుమార్ వార్డ్ అధికారులు, జవాన్లు, ఎలక్ట్రీషియన్స్ పాల్గొన్నారు.

## పీర్జాదిగూడలో బీఆర్ఎస్ గూటికి కాంగ్రెస్, బీజేపీ నాయకులు



మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి , మాజీ కార్పొరేటర్ హరిశంకర్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ చేరుతున్న కాంగ్రెస్, బీజెపి నాయకులకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

**మేడిపల్లి, జూలై 17 ప్రభాతవార్త ;**
పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 3వ డివిజన్ పరిధిలోని బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నుండి 20 మంది నాయకులు 3వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కోనేటి వెంకట్ ఆధ్వర్యంలో మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నాయకులకు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సాయిప్రియ నగర్ కాలనీ బీజేపీ నాయకులు అమర్ పటేల్ తో పాటు నాగరాజు రావు, ప్రశాంత్, మహేష్, ఆంజనేయులు పటేల్, సంతోష్, లక్ష్మారెడ్డి, అబ్దుల్, భాస్కర్, శంకర్, అశోక్, రవికాంత్, సునీల్, రామిరెడ్డి, గౌస్ భాయ్, కిషోర్, టింకు, శామ్యూల్, జోసెఫ్, రవితో పాటు తదితరులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రెటరీ ఎడవెల్లి రఘువర్ధన్ రెడ్డి ,వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు నిర్మల, యూత్ అధ్యక్షుడు పైళ్ల ప్రభాకర్ రెడ్డి, 4వ డివిజన్ అధ్యక్షులు యసారం శ్రీనివాస్, 2వ డివిజన్ అధ్యక్షులు బాల్ రాజు, 3వ డివిజన్ జనరల్ సెక్రెటరీ పింగిళి జోగిరెడ్డి, రెండవ డివిజన్ యూత్ అధ్యక్షుడు కిరణ్ నాయక్, 2వ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వరికల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలలో వికలాంగులకు ప్రాతినిధ్యం కల్పించాలి

### : సాధన కమిటీ చైర్మన్ అహ్మద్ ఖాన్



మంత్రి శ్రీధర్ రావుకు వినతిపత్రం సమర్పిస్తున్న సాధన కమిటీ చైర్మన్ మహమ్మద్ షఫీ అహ్మద్ ఖాన్, మల్లికార్జున్, రాజేందర్ తదితరులు

**మలక్ పేట, జూలై 17, ప్రభాతవార్త:**
స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతూ వికలాంగుల ప్రాతినిధ్య సాధన కమిటీ చైర్మన్ మహమ్మద్ షఫీ అహ్మద్ ఖాన్, వైస్ చైర్మన్ దైనంపల్లి మల్లికార్జున్, సలహాదారుడు తుడుం రాజేందర్, సాధన కమిటీ ప్రతినిధులు ఐటీ శాఖమంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకు వినతిపత్రం సమర్పించారు. బుధవారం సచివాలయం లోని కార్యాలయంలో మంత్రి శ్రీధర్ బాబును కలిసిన ప్రాతినిధ్య సాధన కమిటీ సభ్యులు స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగుల ప్రాతినిధ్య ఆవశ్యకతను వివరించి చెప్పారు. వికలాంగులకు ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా దివ్యాంగుల సమస్యలపై దివ్యాంగులే పోరాడుతారని తెలిపారు. వికలాంగ సమాజం అభివృద్ధి చెందాలంటే దివ్యాంగులు చట్టసభల్లో అడుగు పెట్టాలని వారు అన్నారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను చట్టసభల్లో ఏకరువు పెట్టినప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని, దివ్యాంగ సమాజం అభివృద్ధికి తగిన నిర్ణయాలు తీసుకోబడతాయని వారు వివరించారు. స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా ప్రభుత్వం పై ఎలాంటి ఆర్థిక భారం పడబోదని, రాష్ట్రంలో 25 వేలమంది దివ్యాంగులకు ప్రజా ప్రతినిధులుగా అవకాశం దక్కుతుందని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనే దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, ఆ దిశగా మంత్రి కృషి చేయాలని వారు కోరారు. ప్రాతినిధ్య సాధన కమిటీ సభ్యులు చెప్పిన విషయాలపై సానుకూలంగా స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు స్థానిక సంస్థల్లో వికలాంగుల ప్రాతినిధ్యం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి చర్చిస్తానని హామీ ఇచ్చారు. మంత్రి సానుకూల స్పందన పై సాధన కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ప్రాతినిధ్య సాధన కమిటీ చైర్మన్ ఎండి. షఫీ అహ్మద్ ఖాన్, సలహా దారుడు తుడుం రాజేందర్, వైస్ చైర్మన్ దైనంపల్లి మల్లికార్జున్, రాష్ట్ర నాయకులు శబరి చావ్లా, నరసింహులు, ఎం. మహేశ్వర్, మన్నే పోచయ్య, ఎస్.వెంకట్, సాయి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## బీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు కట్టుబడి పనిచేస్తున్న ప్రభుత్వం

### పీర్జాదిగూడలో రాహుల్, రేవంత్ రెడ్డి, మహేశ్ గౌడ్‌కు పాలాభిషేకం



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్ కు పాలాభిషేకం చేస్తున్న మేడ్చల్ ఇన్చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ ,మాజీ మేయర్ అమర్ సింగ్ ,దర్గా దయాకర్ రెడ్డి తదితరులు

**మేడిపల్లి జూలై 17 ప్రభాతవార్త ;**
స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర మంత్రి మండలి తీర్మానించడం పై హర్షం వ్యక్తం చేస్తూ పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి ఆధ్వర్యంలో లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ .. ఆర్డినెన్స్ జారీ చేసి బీసీలకు స్థానిక సంస్థలో 42 రిజర్వేషన్ కల్పించాలని నిర్ణయం తీసుకొచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , మంత్రి మండలి కి ధన్యవాదాలు తెలియజేశారు . ఇది కేవలం ఆర్డినెన్స్ ప్రారంభించడం కాదని ఇది బీసీ వర్గాల సాధికారతకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన భరోసా , బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా బీసీలకు న్యాయం జరగలేదు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బీసీలకు ధైర్యం ,న్యాయం చేయాలని అన్నారు . ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ అమర్ సింగ్, మేడ్చల్ జిల్లా మాజీ గ్రంథాల చైర్మన్ దర్గా దయాకర్ రెడ్డి , కాంగ్రెస్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి , మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్ , హనుమాన్ టెంపుల్ చైర్మన్ కవాడపు రాంరెడ్డి , కమిటీ సభ్యులు , యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుముల అజయ్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్ ఎం కె దుర్గ ,మాజీ కార్పొరేటర్లు బండారి మంజుల రవీందర్ ,బోడిగే స్వాతి కృష్ణ గౌడ్ ,సుభాష్ నాయక్ , మెంపల్ల అనంతరెడ్డి , కాంగ్రెస్ సీనియర్ నాయకులు మణిరాం నాయక్ ,పాశం బుచ్చి యాదవ్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు , అధిక సంఖ్యలో పాల్గొన్నారు .

## ఒకే ఆలయానికి రెండు పేర్లతో బోనాల చెక్కులా...



వివరాలు వెల్లడిస్తున్న పోచమ్మ ఆలయకమిటి ప్రతినిధులు.

**వనస్థలిపురం జూలై 17 ప్రభాతవార్త**
దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రజాధనం వృధా అవుతుంది. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల ఉత్సవాల సందర్భంగా ప్రభుత్వం దేవాలయాలకు అందించే బోనాల చెక్కుల పంపిణీ ఇష్టానుసారంగా సాగుతుంది. చెక్కుల పంపిణీలో ఉన్నతాధికారుల పర్యవేక్షణా లోపం కింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్యం మూలంగా ప్రజాధనం వృధా అవుతుందన్న ఆరోపణలు వస్తున్నాయి. అందులో భాగంగానే బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఆఫీసర్స్ కాలనీలో ఉన్న ఒకటే ఆలయానికి శ్రీ పోచమ్మ దేవాలయం పేరుతో ఒక చెక్కు, శ్రీ రేణు కా ఎల్లమ్మ దేవాలయం పేరుతో మరో చెక్కు ఎండోమెంట్ శాఖ నుంచి మంజూరయ్యాయి. ఆఫీసర్స్ కాలనీలో ఉన్న దేవాలయం గత 50 సంవత్సరాల క్రితం నుంచే చిన్న గుడిగా పోచమ్మ దేవాయలంగా ఉందని తాము అప్పటి నుంచే పూజలు చేశేవారమని పటేల్ నగర్ బస్తీ వానులు తెలిపారు. తాము ఈ దేవాలయానికి పోచమ్మ దేవాలయం పేరు మీద గత 16 సంవత్సరాల నుంచి బోనాల చెక్కులు అందుతున్నాయని దేవాలయం చైర్మన్ బోద శేఖర్, ఆనంద్, తెలిపారు. భూమి పట్టా దారులే పోచమ్మ దేవాలయం కోసం 2 వందల గజాల స్థలం వదిలారని, ఆ తర్వాత లే అవుట్ తరువాత దాత సామ వెంకట్ రెడ్డి మరో 50 గజాల స్థలం ఇచ్చారని అప్పటి నుంచి ఆలయాన్ని అభివృద్ధిచేసుకుంటు బోనాల ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటున్నామని పటేల్ నగర్ బస్తీ వానులు తెలిపారు. తాజాగా ఈ మధ్య కొంత మంది కాలనీ వానులు శ్రీ పోచమ్మ దేవాలయం పేరు మార్చి రేణుకా ఎల్లమ్మ దేవాలయం అంటు దౌర్జన్యంగా ఆయలంమీద పేరు మార్చడంతో పాటు అక్రమంగా బోనాల చెక్కును కూడా పొందారని ఈ విషయంపై దేవాదాయ శాఖ తగు విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని పోచమ్మ దేవాలయ కమిటి చైర్మన్ బోద ఆనంద్, శేఖర్, ప్రధాన కార్యదర్శి బోద దశరథ, జాయింట్ సెక్రెటరీ కొంగర జంగయ్య, కోశాధికారి జెనిగె అశ్విన్కుమార్, బస్తీ వానులు బోద మల్లయ్య, బోద సంజీవ, బోద శ్రీ శైలం, బోద నంపత్, బోద వరలక్ష్మి, బోద అంజయ్య లు కోరారు. ఈ మేరకు దేవాదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ కు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు.దేవాలయం పేరు మార్చిన వారిపై చర్యలు. తీసుకోవ అంటున్న బస్తీ వాసులు తెలియజేశారు.

## సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో బోనాల జాతర మహోత్సవ ఊరేగింపు

### క్యాంపు కార్యాలయం నుండి జిల్లెలగూడ కట్టమైసమ్మ ఆలయం వరకు అట్టహాసంగా సాగిన ఊరేగింపు



క్యాంపు కార్యాలయం వద్ద పోతరాజుల విన్యాసాల మధ్య బోనాల ఊరేగింపును ప్రారంభించిన సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, జూలై 17 ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఆషాఢ మాస బోనాల జాతర మహోత్సవ ఊరేగింపును కనుల పండువగా నిర్వహించారు. దీన్‌దయాళ్‌నగర్, ధాతనగర్ క్రాస్ రోడ్స్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి పోతరాజుల విన్యాసాల మధ్య బోనాల ఊరేగింపు ప్రారంభమైంది. నియోజకవర్గవ్యాప్తంగా తరలివచ్చిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్ళ కోలాహలం మధ్య ఊరేగింపు జిల్లెలగూడ చందన చెరువు కట్ట మైసమ్మ ఆలయం వరకు సాగింది. అనంతరం ఆలయంలో సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి బోనాల సమర్పణ జరిగింది. ఈ సందర్భంగా కట్ట మైసమ్మ అమ్మవారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు పట్లోళ్ళ కౌశిక్‌రెడ్డి, మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ల బిఆర్ఎస్ పార్టీల అధ్యక్షులు అర్కల కామేష్‌రెడ్డి, రామిడి రాంరెడ్డిలతో పాటు మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## ప్రణాళిక బద్ధంగా చదువుతేనె గమ్యాన్ని చేరుకోవచ్చు : డాక్టర్ నరేందర్ రెడ్డి



విజయోత్సవంలో పాల్గొన్న నరేందర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, జులై 17 ప్రభాతవార్త:**
విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదువుతేనె గమ్యాన్ని చేరుకోవచ్చు అని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. లక్ష్మీగార్డెన్‌లో అల్ఫోర్స్ జూనియర్ కళాశాలల రోర్ సాంస్కృతిక కార్యక్రమ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ...సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ఒత్తిడి నుండి ఉపశమనం పొందడమే కాకుండా విజయం పట్ల ఆసక్తిని పెంపొందించుకొని పోటీ తత్వాన్ని అలవర్చుకోవచ్చని అన్నారు. విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదువుకొని అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కష్టపడి నిర్వహింపబడే వివిధ రకాల పరీక్షలలో ప్రతిభను చాటి ఘనవిజయాలు సాధించాలన్నారు. భారతదేశం కళలకు నిలయమని, మన దేశంలోని సంస్కృతి సాంప్రదాయాలు ఇతర దేశాలకు ఎంతగానో మార్గదర్శకమని కొనియాడారు. ప్రతి విద్యార్థి సంస్కృతిని పరిరక్షించి భారత దేశ అభివృద్ధికి చేయూతనిచ్చి అగ్రగామిగా ఉండాలన్నారు.ఇటీవల కాలంలో చాలా మంది విద్యార్థులు అద్భుతమైన ప్రణాళికలతో అత్యుత్తమ మార్కులను సాధించి ఉన్నత విద్యా సంస్థల్లో సీట్లను సాధిస్తున్నారని అందుకు సహకరిస్తున్న తల్లిదండ్రులకు అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సామాజిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బోనాల పండుగకు ముస్తాబైన నల్ల పోచమ్మ దేవాలయం



విష్ణునగర్‌లోని నల్ల పోచమ్మ దేవాలయం

**సైదాబాద్, జూలై 17 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ విష్ణు నగర్‌లోని నల్ల పోచమ్మ దేవాలయం బోనాల పండుగకు ముస్తాబయింది. విష్ణునగర్‌తో పాటు పరిసర కాలనీల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు. అత్యంత మహిమాన్విత దేవాలయంగా ఇక్కడి అమ్మవారిని భక్తులు కొలుస్తారు. ఆదివారం జరిగే బోనాల పండుగకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నామని దేవాలయ వ్యవస్థాపక ధర్మకర్త కదారి బిక్షపతి యాదవ్ తెలిపారు. దేవాలయ కమిటీ నిర్వాహకులుగా కృష్ణ యాదవ్, రవి కుమార్, రోహిత్, హరీష్, బస్వా, ప్రకాష్ ఉన్నారు.

## ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి : కార్పొరేటర్



మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, జూలై 17 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరు కనీసం రెండు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. వన మహోత్సవంలో భాగంగా ఎస్‌బిహెచ్ జిఎ 1 కాలనీలోని పార్కులో స్థానికులతో కలిసి మొక్కలు నాటిన అనంతరం కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ అమ్మ పేరుతో చెట్టు అనే ప్రధాని నరేంద్రమోడి నినాదాన్ని స్పూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి రమేష్ కుమార్, సంయుక్త కార్యదర్శి ఆనంద్ పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న అరుణసురేందర్ యాదవ్

**ఎల్.బి.నగర్, జులై 17 ప్రభాతవార్త:** నాగోల్ డివిజన్ పరిధిలోని జైపూర్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగాకార్పొరేటర్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని తల్లిదండ్రులకు, చదువుకున్న పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రైవేటు పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ఉన్నత స్థానాలను అధిరోహించాలని అన్నారు. అదేవిధంగా నాగోల్ డివిజన్ అరుణోదయ కాలనీ రోడ్ నెంబర్ 6లో రూ.16 లక్షల వ్యయంతో వరద నీటి కాలువ పైప్ లైన్ పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగాకార్పొరేటర్ మాట్లాడుతూ చాలా సంవత్సరాల నుండి ఈ సమస్య ఉండడం వలన కాలనీలోని అపార్ట్మెంట్స్ ఇళ్లలోకి వర్షపు నీరు చేరుతోందని, ఈ సమస్య తమ దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించి అధికారులు దృష్టికి తీసుకెళ్లి పని ప్రారంభించడం జరిగిందన్నారు.

## వనస్థలిపురం డివిజన్ బిజెపి అధ్యక్షుడుగా క్రాంతిగౌడ్



క్రాంతిగౌడ్‌కు నియామకపు పత్రాన్ని అందజేస్తున్న వనిపల్లి.

**వనస్థలిపురం జూలై 17,ప్రభాతవార్త** బీజేపీ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడుగా కాటం క్రాంతిగౌడ్ నియమితులైనారు. ఈ మేరకు బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తర్వులు జారీచేసి, నియామకపు పత్రాన్ని క్రాంతి గౌడ్ కు అందజేశారు. ఈ సందర్భంగా క్రాంతిగౌడ్ గురువారం వారు మాట్లాడుతు తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డికి సుభాష్ చందర్ జీ. సామ రంగా రెడ్డి, కొత్త రవిందర్ గౌడ్, వంగ మధుసూదన్ రెడ్డి, కళ్లెం రవీందర్ రెడ్డి, జక్కిడి. ప్రభాకర్ రెడ్డి. అంజన్ కుమార్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.

## నేరెడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యక్తి అదృశ్యం

**నేరెడ్ మెట్, జులై 17ప్రభాతవార్త.** నేరెడ్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సీతారాం నగర్, నాగార్జున అపార్ట్మెంట్ లో నివసించే శాలిని బేగం భర్త సలీమ్ ఖాన్ (38) జూన్ 30వ తేదీన ఉదయం ఏడు గంటలకు ఆటో సవారీ కోసం ఇంటి నుండి బయటకు వెళ్లి ఈ రోజు వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు నేరెడ్ మెట్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసారు. గతంలో కూడా ఇంటి నుండి వెళ్లిన రెండు, మూడు రోజులకి మళ్ళీ తిరిగి వచ్చేవాడు కానీ, నా భర్త ఈ మధ్యకాలంలో బాగా అప్పులు చేసి ఆ అప్పులను కట్టలేక ఇంటి నుండి వెళ్లిపోయాడేమో అని భార్య శాలిని బేగం ఇచ్చినా కంప్లైంట్ మేరకు నేరెడ్ మెట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## గృహిణి అదృశ్యం..

**నేరెడ్ మెట్, జులై 17ప్రభాతవార్త.** నేరెడ్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వినాయ కనగర్ డివిజన్, దీన్ దయ నగర్ లో నివసించే దాసాని రఘోత్తం రెడ్డి ఫిర్యాదు మేరకు, ఆయన భార్య దాసాని సత్యలక్ష్మి (25), గృహిణి, భార్యాభర్తలు ఇద్దరికీ అప్పుడప్పుడు తరచుగా గొడవలు జరుగుతూ ఉండేవి అని వారం రోజుల క్రితం రాత్రి 11గంటలకు ఇంట్లో నుండి బయటకు వెళ్లిపోయి తిరిగి రాలేదని ఫోను కూడా స్విచ్ ఆఫ్ వస్తుంది అని భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు నేరెడ్ మెట్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసినవారు నేరెడ్ మెట్ పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలన్నారు.



కొత్తపేట డివిజన్ మహిళా ప్రెసిడెంట్ విజయగౌడ్ ఆధ్వర్యంలో ఆషాడ మాస గోరింటాకు సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు జ్యోతి, నాగలక్ష్మి, శిల్ప, శైలజ, రోజా, సూరజ్, అనురాధ, మల్లిక, వసంత, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.(ఎల్.బి.నగర్, ప్రభాతవార్త)

## బోడుప్పల్ అభివృద్ధికి 3 కోట్ల మంజూరు



మున్సిపల్ శాఖ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ భాస్కర్ రెడ్డిని కలిసినా బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ,కొత్త కిషోర్ గౌడ్ ,కిరణ్ రెడ్డి తదితరులు

**బోడుప్పల్, జూలై 17 ప్రభాతవార్త ;** పబ్లిక్ హెల్త్,మున్సిపల్ శాఖ ఇంజనీరింగ్ చీఫ్ భాస్కర్ రెడ్డిని బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్,మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్,మాజీ కార్పొరేటర్ కుంభం కిరణ్ కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కు మంజూరైనా 3 కోట్ల నిధులతో త్వరగా అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు.

## మహేశ్వరం నియోజకవర్గంలో బోనాల చెక్కుల పంపిణీ



బోనాల చెక్కులను పంపిణీ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు హర్కర వేణుగోపాలరావు, మాజీ మంత్రి సబితారెడ్డి

**సరూర్‌నగర్, జూలై 17 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడలోనున్న పురాతన శ్రీ మత్స్యావతార వెంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం బోనాల చెక్కులను పంపిణీ చేశారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ ఇఓ శ్రీనివాస్‌రెడ్డి ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ మంత్రి, స్థానిక నియోజకవర్గ ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు హర్కర వేణుగోపాలరావులు టియుఎఫ్‌ఐడిసి చైర్మన్ చల్లా నర్సింహారెడ్డితో కలిసి అమ్మవారి దేవాలయాల కమిటీల వారికి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ ధర్మకర్తలు అర్కల భూపాల్‌రెడ్డి, బొమ్మరబోయిన యాదగిరి ముదిరాజ్, చింతపట్ల జ్ఞానేశ్వరచారి, పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

## గ్రామ దేవతలకు యెల్మేటి అమరేందర్‌రెడ్డి పూజలు



ఆలయాల్లో పూజలు నిర్వహిస్తున్న యెల్మేటి అమరేందర్‌రెడ్డి

**సరూర్‌నగర్, జూలై 17 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్ గ్రామంలో బోనాల పండుగ సందర్భంగా సీనియర్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, టిపిసిసి కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి గ్రామ దేవతలైన మహంకాళి, పోచమ్మ, రేణుక ఎల్లమ్మ, కట్ట మైసమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యెల్మేటి కుటుంబ సభ్యులతో పాటు గోల్కొండ సత్తయ్య, రవీందర్ బాబు, ఎల్లయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాలాపూర్‌లో ఘనంగా బోనాల పండుగ



ఎమ్మెల్యేతో పూజల్లో బాలాపూర్ గ్రామ బిఆర్ఎస్ నాయకులు వంగేటి లక్ష్మీ లక్ష్మారెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, జూలై 17 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ గ్రామంలో గురువారం బోనాల పండుగ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు భక్తి శ్రద్ధలతో గ్రామ దేవతలకు పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవార్లకు సాక సమర్పించారు. అయితే బాలాపూర్ బోనాల ఉత్సవాలకు హాజరైన మాజీ మంత్రి, స్థానిక మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి గ్రామ దేవత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వంగేటి లక్ష్మారెడ్డి, వంగేటి లక్ష్మి, కళ్లెం ఎల్లారెడ్డి, అత్తాపురం శ్రీనివాస్‌రెడ్డి, తిమ్మని గిరీష్, అరవింద్‌గౌడ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## బోనాల జాతర పోస్టర్ ఆవిష్కరణ



తెలంగాణ బోనాల జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**సరూర్‌నగర్, జూలై 17 ప్రభాతవార్త:**
కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఆషాఢ మాస బోనాల జాతర మహోత్సవ వాల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు హర్కర వేణుగోపాలరావు బోనాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టియుఎఫ్‌ఐడిసి చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, టిపిసిసి సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, టిపిసిసి ప్రచార కమిటీ సభ్యుడు సామిడి గోపాల్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సామిడి చరణ్‌రెడ్డిలతో పాటు ఎరుకల వెంకటేశ్‌గౌడ్, సిద్దాల శ్రీశైలం, గజ్జెల రాంచందర్, ఏదుదొడ్ల సురేందర్‌రెడ్డి, నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్, అరుణ, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.